# మనోహర ప్రతిజ్ఞ

విక్రమాదిత్యుడు, తన పన్నెండుగురు మంత్రులతో విజయ యాత్రలు సలిపి, త్రోవలో మిత్రుడైన కళింగ చక్రవర్తిని దర్శించాడు. బంగారు యేనుగుల సింహాసనం తోనూ, కాశ్మీరపు విలువగల తివాసీలతోనూ అలంకరించిన భవనములో వీరినందరినీ యశోవర్థనుడు సత్కరించాడు. తన వైభవం వెల్లడయ్యేట్టు. హంసనడక పావురాళ్ళ కనుగుడ్లతో మాత్రమే, ఆడ కోవెలల గుండెలతో మాత్రమే, బంగారు చేపల తలలతో మాత్రమే. తయారైన కూరలూ, ముత్యాలలాగ మెరుస్తో మంచి రుచి, వాసన స్వతహాగా కలిగిన బియ్యపు అన్నమూ సింహళము నించి తెచ్చిన, పేరైనా తెలీని, అపురూపపు పలుకులతోనూ జపాన్ దేశపు రాజు కాన్కగా యిచ్చిన పచ్చ కర్పూరముతోనూ తయారైన పాయసాన్నీ ఒక్కొక్క రాజ్యం విలువచేసే పరిషియా బానిస కన్యలచేత వడ్డింపించాడు. అద్భుత నృత్య గానాదులతో వారిని మైమరపించి, గ్రీకుదేశపు ఉత్తమ ద్రాక్షారసంతో వాళ్ళని నింపి చివరికి పడక గదిలో వారిని ప్రవేశపెట్టాడు. ఆ గుండ్రని గదిలో, మధ్యనున్న పెద్ద స్తంభంచుట్టూ పదమూడు మంచాలు వేసి వున్నాయి. దూరం నించి కిన్నెర గానం మెల్లిగా వినిపిస్తోంది. దీపం కనపడని మృదువైన తెల్లని వెలుగు గదిని నింపింది. తమ యదట నృత్యం చేసిన వేశ్యల సౌకుమార్యాన్ని తలచుకుంటో, మొహమల్ పరుపుల మీద పడుకుని తలకెక్కిన సారాయి దివ్యమంత్రంవల్ల దీపించే ప్రభలతో ఒకర్నిమించి వొకరు ప్రజ్ఞలు కొట్టడం ప్రారంభించారు.

ముందు విక్రమాదిత్యుడన్నారు కదా "యీ రాజు సైనికుల్లో బలిష్టుడైనవాణ్ణి గుర్రంమీద కూచోపెట్టి తలమీద నా కత్తితో ఒక్క దెబ్బ కొట్టానంటే, వాడూ గుర్రమూ సగానికి తెగి, కత్తి రెండు గజాల లోతు భూమిలో పాతుకోవాలి."

ప్రధానమంత్రి గజబలుడు

"అరవైమంది యెత్తలేని యినపగుండుని యీ కోట గోడమీద వొంటిచేత్తో విసిరానంటే, అరవైగజాల మేడ గోడ కూలాల"న్నాడు.

ఈ సాయంత్రం మనం చూసిన పెద్ద ధ్వజస్తంభాన్ని గడ్డిపోచమల్లే చీల్చేస్తా" నన్నాడు తేజసింహుడు. ఆరుగురు బానిసలు జాగ్రత్తతో పదేళ్ళు పెంచిన నల్లని మీసాలు మెలేస్తో.

"యింతేనా గొప్ప? గుడి గాలిగోపురాన్ని భుజంమీద పెట్టుకొని సముద్రం దగ్గిరకి మోసుకుపోతా"నన్నాడు. వాలు కత్తికాట్లు కనపడే తన భుజం చరుస్తోదండనాథుడు.

అమరాంతకుడు బిగ్గరగా నవ్వి "రాజుగారి తోటలో చెట్లన్నీ ఒక్క చేత్తో గంటలో పెరికేస్తా"నన్నాడు.

ప్రణయగంభీరు డేమన్నాడంటే!

"యశోవర్థనుడు భోజనం చేస్తూ వుండగా అతనికి తెలీకుండా రత్న పళ్ళెంలోని ఫలహారాలన్నిటిని తిని ద్రాక్షారసాన్నంతా తాగేస్తాను!"

"ఇంతేనా? ఆయనకి తెలీకుండా ముక్కుపట్టుకులాగి, చంపమీద కొట్టి యేడిపిస్తాను" అన్నాడు, వాసవదత్తుడు.

రూపావతంసుడు "రాజుగారి తోటలో పళ్ళన్నీ అరగంటలో తినేస్తా"నన్నాడు.

"యశోవర్ధనుడి బంగారు గిన్నెలన్నీ మళ్ళీ కిందపడకుండా యెగరేసి అట్లానే పంపిస్తాన"న్నాడు భాస్కరామాత్యుడు.

"ఈ మహానది తోవను మళ్ళించి యీ పట్నపు రాజవీధిని వరదల పాలు చేస్తాను" అని ప్రగల్భం కొట్టాడు నృశింహదేవర.

రాజశేఖరుడన్నాడు కదా,

"పన్నెండుమంది వీరుల్ని వరసగా నుంచోపెడితే, నా కత్తి విసురువల్ల తగిలే గాలితో వాళ్ళందరినీ ముక్కుమన్నయ్యేట్టు పడేస్తాను."

అందరి ప్రజ్ఞలూ కాగా చివరికి, విక్రమాదిత్యుడి అనుంగుమంత్రి, ఇరవైయేళ్ళ కుర్రవాడు, మనోహరమూర్తి మిగిలాడు.

"మనోహరా నువ్వేమీ ప్రజ్ఞ పట్టవా?" అని అడిగాడు, రాజు నవ్వుతో.

"తప్పకుండా... విష్ణువర్ధనుడనే మహావీరుడి పేరు మీరందరూ వినే వుంటారు. అతడు పండితుడు, దాత, మహా బలవంతుడు. సమస్త అవయవపుష్టి కలవాడు. ఆ దేశపు రాజుగారి యాభైమంది కుమార్తెల్నీ ఒక్కసారిగానే పెళ్ళిచేసుకుని, రాత్రే యాభైమందికీ జవాబు చెప్పి సంపూర్ణ సంతుష్టి కలిగిందని చెప్పుకునేట్టు చేశాడు. యాభైమందిలో ఒక్కర్నీ మరిచిపోలేదు. ఒక్కరికీ లోపం చెయ్యలేదు. నేనూ అంత శక్తిగలవాణ్ణని నిర్ధారణ చేస్తాను."

"ఈ యశోవర్ధనుడి కుమార్తె వొక్కతేకదా మరీ!"

"అయితేనేం? ఆమెనే పెళ్ళాడి - విష్ణువర్ధనుడికి తీసిపోని సామర్థ్యం ఒక రాత్రిలోనే వ్యక్తపరిచినట్లు నిర్ధారణ చేస్తాను."

అంటూ వుండగానే ఆ గది మధ్యనున్న స్తంభం తెరుచుకుని వుగ్రనరసింహ మూర్తివలె మండిపడుతో యశోవర్ధనుడు వొచ్చి వాళ్ళముందు నిల్చున్నాడు.

"దీనిలో నుంచి మీ డాబులు వింటున్నాను. నా ఆతిథ్యానికి చేసే వుపకారం యిదా? తిని వాసాలు లెఖ్ఖ పెడుతున్నారా? మంచి అతిథులే. రేపు పొద్దున లేవగానే మీలో యెవరు తలపెట్టిన ప్రజ్ఞను సార్థకపరుచుకోరో వారి తల తీసేయిస్తాను" అంటో స్తంభంలో మాయమైనాడు.

మర్నాడు గొప్ప సభ యేర్పాటయింది. యీ పదముగ్గుర్నీ రాజసభకు తీసుకు వెళ్ళారు. విక్రమాదిత్యుడు ఇష్టదేవతని ఆరాధిస్తో నిలుచున్నాడు. సభా భవనం మధ్య పన్నెండుగురు మహామంత్రులతోనూ, యశోవర్ధనుడు వాళ్ళని ప్రజ్ఞలు చూపమని ఆనతిచ్చాడు. పదిమంది మంత్రులూ తలో దోవనా వెళ్ళారు. వూపిరి బిగబట్టి ప్రజలు

యేం జరుగుతుందోనని చూస్తున్నారు. అరగడియలో భూకుహరం బద్దలైనట్లు పెద్ద శబ్దమయింది. సభాస్థానపు పెద్ద స్తంభాలు, లావు గోడలు, బంగారు సింహాసనం వొణికాయి, ముత్యాల తోరణాలు, మాణిక్యదీపాలు తెగి కింద రాలాయి. వార్తాహరులు నాలుగు వేపుల్నించీ వొచ్చి రాజుగారి పాదాలమీద పడ్డారు.

"మహాప్రభూ, అరవైగజాల కోటగోడ కూలింది."

"రాజాధిరాజా, ధ్వజస్తంభం ఎండుపుల్లలాగు విరిగింది. గాలి గోపురం సముద్రంవేపు యెగిరిపోయింది."

"మహారాజా, రాజవీధిలోకి నది వరదలై ప్రవహించింది. ఇళ్ళలో చేపలూ, మొసళ్ళూ కాపరమేర్పరచుకుంటున్నాయి. అదిగో కోటగోడని నదీప్రవాహం తట్టుతోంది."

"గుర్రంమీది సేనానీ, గుర్రమూ రెండుగా చీలి భూమి రెండు గజాల లోతు బద్దలయింది."

"తోటంతా ధ్వసం, ఒక్క మొక్కలేదు. మహావృక్షాలతో సహా సర్వనాశనమయింది."

"రుచికైనా ఒక్క పండుగాని, కాయగాని దొరకదు."

పవిత్రరూపిణి, సావిత్రిని, మనోహరమూర్తి హృదయాన నిల్పి తన ప్రతిజ్ఞ నెరవేర్చమని, ప్రార్థిస్తున్నాడు. కాని ఒక సందేహం పట్టుకుంది అతనికి.

"ఎట్లా యీ పనిలో సహాయపడమని పవిత్రకన్యని సావిత్రీదేవి నడగను? ఆమె యిట్లాంటి వరాలెవరికీ యిచ్చినట్లు శాస్త్రాలలో కనపడదు. అసలిట్లాంటి వ్యవహారం ఆమెకర్థమవుతుందా. ఆమె అనుభవంలో వుండివుంటుందా?

"మనోహరమూర్తీ, మీరు కానీండి" అన్నాడు రాజు.

"మీ కుమార్తె అద్భుత సౌందర్య సంపదను తలుచుకుని, ఆమె దర్శనానికై ఉవ్విళ్ళూరుతున్నాను."

ఇద్దరికీ వివాహం జరిపారు సాయంత్రం.

"ప్రతిజ్ఞ పాడైనా, వుదయాన శిరోహీనుణ్ణైనా ఒక్క రాత్రికి యీ అద్భుత సౌందర్యాన్న నుభవిస్తాను గద! యుద్ధంలో చచ్చినా, కుళ్ళు రంభాభోగమే కద. ప్రతిఫలము! అయినా భయంలేదు. రాత్రి నా నిశ్చితాభిప్రాయమూ, అమోఘ ప్రయత్నమూ, సర్వసాక్షి సావిత్రి చూసి, నా పక్కన నిలబడి నూతనోత్సాహాన్ని యివ్వపోతుందా, ఆ దాసుల పాలిటి కల్పతరువు? అనుకున్నాడు.

తెల్లవారి రాజకుమారినీ, మనోహరమూర్తినీ యశోధరవర్మ సభలోకి రప్పించాడు. విక్రమాదిత్యుడూ మంత్రులూ వుచితాసనముల మీద ఆసీనులై వున్నారు.

"ఏం మనోహరమూర్తీ, ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నావా?" అని గర్జించారు రాజుగారు.

అతను మాట్లాడక, కళ్ళకిందనుంచి వధువువంక చూశాడు. ఆమె, పాలూ రోజా పువ్వులూ మరిపించే చంపల మీద యెరుపు ఛాయలు తాండవమాడుతో, వినీవినపడనట్లు.

"ఆ" అని తల వూయించింది.

అసామాన్య ప్రతిభావంతుడైన అల్లుణ్ణి సింహాసనం మీదనించి దూకి, కావిలించుకున్నారు రాజుగారు.

విక్రమాదిత్యుడు తటాలున ఆనందంతో వొచ్చి వధువును కౌగలించుకుని, ఆమె చెవులో రహస్యంగా

"నిజమేనా?" అన్నాడు.

"మీ మంత్రి మనోహరుడు, నిజంగా మనోహరుడే! ఆ చతురుడి రసికత్వంలో వొళ్ళు మరచి లెఖ్ఖ పెట్టడం మరచిపోయాను. లోకమే మరపించాడు...."

నూతన వధువుతో పన్నెండుగురు మంత్రులతో విక్రమాదిత్య ప్రభువు వుజ్జయినికి ప్రయాణమైనాడు.

◆ ◆ ◆

*అనువాదాలు రచనాకాలం : 1927*

*ప్రచురణ : (చుక్కమ్మ కథలు) దేశీప్రచురణలు, 1957*